బలగం
BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ గురువారం 05 మార్చి 2026 | www.balagamtv.com | పేజీలు 4

# నేడు ఎస్ఎస్సీ హాల్‌టికెట్లు విడుదల..!

## వెబ్‌సైట్, వాట్సాప్, పాఠశాలల ద్వారా మూడు విధాలుగా...

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రవ్యాప్తంగా 2025--26 విద్యా సంవత్సరానికి సంబంధించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల హాల్‌టికెట్లు గురువారం (మార్చి 5) విడుదల కానున్నాయి. ఈ మేరకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈసారి హాల్‌టికెట్లను మూడు రకాలుగా అందుబాటులోకి తేనున్నట్లు అధికారులు తెలిపారు. ముందుగా తెలంగాణ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ అధికారిక వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లను విడుదల చేస్తారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రుల నమోదిత వాట్సాప్ నంబర్లకు కూడా హాల్‌టికెట్లు పంపిస్తారు. అలాగే ముద్రిత ప్రతులను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలలకు పంపిణీ చేస్తారు.

**ఫీజు బకాయిల పేరుతో ఇబ్బందులకు చెక్**

కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ఫీజు బకాయిల పేరుతో హాల్‌టికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ప్రతి ఏడాది ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు విద్యాశాఖ పేర్కొంది. విద్యార్థులు ఈ మూడు మార్గాల్లో ఏదైనా ద్వారా తమ హాల్‌టికెట్లను పొందవచ్చు.

మిగితా 2వ పేజీలో

# అమిత్ షాతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

## మావోయిస్టుల లొంగుబాటు, పునరావాసంపై చర్చలు



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగిన ఈ సమావేశం గంటకు పైగా కొనసాగింది. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ, మావోయిస్టు కార్యకలాపాల నియంత్రణ వంటి కీలక అంశాలపై విస్తృత చర్చలు జరిగాయి.

ఈ సమావేశంలో ప్రధానంగా రాష్ట్రంలోని మావోయిస్టుల సమస్యపై దృష్టి సారించారు. మావోయిస్టుల లొంగుబాటు, వారికి పునరావాసం కల్పించే విధానాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. తెలంగాణను మావోయిస్టు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఈ నెల 31న కేంద్ర ప్రభుత్వం నిర్వహించనున్న "మావోయిస్టు రహిత భారత్ కాన్ఫరెన్స్"పై కూడా ప్రాథమిక చర్చలు జరిగాయి. దేశవ్యాప్తంగా నక్సలిజం ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో నిర్వహించనున్న ఈ సదస్సులో తెలంగాణ తరపున అనుసరించాల్సిన వ్యూహాలపై అమిత్ షాతో సీఎం చర్చించినట్లు తెలిసింది.సీఎం రేవంత్ రెడ్డి వెంట రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులు కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి, ఐజి సుమతి రాష్ట్ర భద్రతా పరిస్థితులపై కేంద్ర హోం మంత్రికి వివరించారు. కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో తెలంగాణలో మావోయిస్టు ముప్పును పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా ఈ సమావేశం జరిగినట్లు అధికార వర్గాలు తెలిపాయి. భద్రతా అంశాలతో పాటు రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పెండింగ్ సమస్యలపై కూడా సీఎం ఈ పర్యటనలో చర్చించినట్లు సమాచారం.

# భారత్‌కు చమురు తరలింపునకు రష్యా సిద్ధం..!

- మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు:.. భారత్‌కు రష్యా చమురు మళ్లింపు సిద్ధం
- తక్షణ సరఫరా అవకాశం
- భారత్‌లో పరిమిత నిల్వలు
- భారత జలాలకు సమీపంలో సుమారు 95 లక్షల బారెల్ల రష్యా ముడి చమురుతో నౌకలు ఉన్నట్లు పరిశ్రమ వర్గాలు వెల్లడి



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితుల కారణంగా చమురు సరఫరాల్లో అంతరాయం ఏర్పడుతున్న నేపథ్యంలో భారత్‌కు అవసరమైన ముడి చమురును మళ్లించేందుకు రష్యా సిద్ధంగా ఉన్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం భారత జలాలకు సమీపంలో రష్యా ముడి చమురుతో నిండిన సుమారు 95 లక్షల బారెల్ల సామర్థ్యం గల నౌకలు ఉండగా, అవి కొద్ది వారాల్లో భారత్‌కు చేరుకునే అవకాశమున్నట్లు సమాచారం.సరఫరా అంతరాయం తలెత్తిన పరిస్థితుల్లో భారత రిఫైనరీలకు ఇది తక్షణ ఉపశమనం కలిగించే అవకాశముందని వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం భారత్ వద్ద ఉన్న ముడి చమురు నిల్వలు కేవలం 25 రోజుల అవసరానికి సరిపడే స్థాయిలోనే ఉన్నాయి. డీజిల్, పెట్రోలు, ఎల్పీజీ నిల్వలు కూడా పరిమితంగానే ఉన్నట్లు తెలుస్తోంది.

**హోర్ముజ్ జలసంధి ప్రభావం**

భారత్ దిగుమతి చేసుకునే ముడి చమురులో సుమారు 40 శాతం హోర్ముజ్ జలసంధి మార్గం గుండా రవాణా అవుతోంది. ప్రపంచంలో అత్యంత కీలకమైన చమురు రవాణా మార్గంగా గుర్తింపు పొందిన ఈ జలసంధి ప్రస్తుతం ఉద్రిక్తతల కారణంగా దాదాపు అందుబాటులో లేకుండా మారింది. అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు ప్రతిగా ఇరాన్ చేపట్టిన చర్యలతో కొన్ని నౌకలు దెబ్బతిన్నట్లు సమాచారం. భారత రిఫైనరీలు రోజుకు సుమారు 56 లక్షల బారెల్ల ముడి చమురును శుద్ధి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ సరఫరా మార్గాల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. మరో 10--15 రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందన్న దానిపై సమీక్ష జరుగుతోందని అధికార వర్గాలు తెలిపాయి.

**రష్యా వాటా పెరుగుదల?**

భారత్ అవసరమైన ముడి చమురులో గరిష్ఠంగా 40 శాతం వరకు సరఫరా చేయడానికి రష్యా సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. అయితే అమెరికాతో వాణిజ్య చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకత్వం కీలకంగా మారనుంది.

గతంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశం రష్యా చమురు కొనుగోళ్లపై పన్నులు విధించినప్పటికీ, తరువాత వాటిని ఉపసంహరించుకునేందుకు అంగీకరించారు. భారత్ మాత్రం మార్కెట్ పరిస్థితులు, అంతర్జాతీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకొని సరఫరాలను విభిన్నీకరించడమే తమ విధానమని స్పష్టం చేసింది.

**ఎల్ఎన్‌జీ సరఫరాపై ప్రభావం**

యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ప్రధాన సరఫరాదారు ఖతర్ ఉత్పత్తి నిలిపివేయడంతో, ద్రవీభవించిన సహజ వాయువు సరఫరాలో కూడా అంతరాయం ఏర్పడే అవకాశముంది. అవసరమైతే రష్యా ఎల్ఎన్‌జీ సరఫరా చేయడానికి సిద్ధంగా ఉందని వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటికే కొంతమంది పారిశ్రామిక వినియోగదారులకు గ్యాస్ సరఫరా తగ్గించినట్లు సమాచారం. మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో చమురు ధరలు పెరుగుతున్నాయి. రష్యా చమురు ఇప్పటివరకు రాయితీ ధరలకు లభించినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో ఇది విక్రేతల మార్కెట్‌గా మారే అవకాశముందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# శ్రీలంక తీరంలో ఇరాన్ యుద్ధనౌకపై దాడి

- 87 మంది మృతి
- 32 మందిని రక్షించిన శ్రీలంక నౌకాదళం



**బలగం టీవీ, కొలంబో**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ శ్రీలంక తీరానికి సమీపంలో ఇరాన్‌కు చెందిన యుద్ధనౌక IRIS Denaపై దాడి జరిగిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనలో 87 మంది మృతి చెందినట్లు శ్రీలంక నౌకాదళ అధికారులు వెల్లడించారు. 180 మంది సిబ్బందితో ప్రయాణిస్తున్న నౌకలో తొలుత 101 మంది గల్లంతైనట్లు సమాచారం. 72 మందికి పైగా గాయపడినట్లు తెలుస్తోంది.

గాలే తీరానికి 40 నాటికల్ మైళ్ల దూరంలో నౌక ప్రమాదంలో ఉందని సమాచారం అందిన వెంటనే సహాయక చర్యలు ప్రారంభించినట్లు శ్రీలంక విదేశాంగ మంత్రి Vijitha Herath పార్లమెంటులో తెలిపారు. నౌకాదళంతో పాటు వైమానిక దళ విమానాలను పంపించి రక్షణ చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఇప్పటివరకు 32 మందిని రక్షించి ఆసుపత్రులకు తరలించినట్లు, వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండగా ఏడుగురికి అత్యవసర చికిత్స అందిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

'ఐఆర్ఐఎన్ఎస్ డెనా'గా కూడా పిలువబడే ఈ నౌక ఇటీవల భారత్‌లో నిర్వహించిన అంతర్జాతీయ నౌకాదళ సమీక్ష లో పాల్గొని తిరుగు ప్రయాణంలో ఉండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఫిబ్రవరి 18 నుంచి 25 వరకు బంగాళాఖాతంలో జరిగిన నౌకాదళ వ్యాయామాల్లోనూ పాల్గొన్నట్లు సమాచారం. విశాఖపట్నంలో జరిగిన పోర్ట్ కాల్ సందర్భంగా భారత తూర్పు నౌకాదళ కమాండ్ ఈ నౌకను ఆహ్వానించినట్లు గతంలో వెల్లడించింది.

శ్రీలంక నౌకాదళం తెలిపిన వివరాల ప్రకారం, ఇప్పటివరకు 32 మందిని రక్షించగా, పలువురి మృతదేహాలను సముద్రం నుంచి వెలికితీశారు. గాయపడిన వారిని గాలే ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. "మరింత మంది ప్రాణాలను కాపాడగలమనే ఆశతో శోధన కొనసాగుతోంది" అని శ్రీలంక నౌకాదళ ప్రతినిధి కమాండర్ బుద్ధిక సంపత్ తెలిపారు. నౌక మునిగిన ప్రాంతంలో చమురు మరకలు మాత్రమే కనిపించాయని, ఇతర నౌకలు లేదా విమానాలు గమనించలేదని వెల్లడించారు.

ప్రారంభంలో నౌక మునిగిన కారణాలపై విభిన్న వాదనలు వినిపించాయి. జలాంతర్గామి దాడి జరిగి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమైనప్పటికీ స్పష్టత లేకపోయింది. అయితే అమెరికా రక్షణశాఖ అధికారిక ప్రకటనతో ఈ ఘటనలో అమెరికా ప్రమేయం ఉన్నట్లు తేలింది. దీంతో ఈ సంఘటన అంతర్జాతీయ స్థాయిలో ఉద్రిక్తతలను మరింత పెంచింది. ఈ ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు అనంతరం మరిన్ని వివరాలు వెలువడే అవకాశం ఉంది.

# సింగూర్ ప్రాజెక్టు కాల్వ పనులు జూన్ 26లోపు పూర్తి చేయాలి

## డ్యాం భద్రతపై అత్యవసర చర్యలు చేపట్టాలి

## నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సింగూర్ ప్రాజెక్టుకు సంబంధించిన మిగిలిన కాల్వ లైనింగ్ పనులను జూన్ 26లోపు పూర్తి చేయాలని అధికారులను తెలంగాణ సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. జాతీయ స్థాయి సంస్థలు వ్యక్తం చేసిన ఆందోళనల నేపథ్యంలో సింగూర్ డ్యాం భద్రతపై తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.బుధవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశానికి మంత్రి అధ్యక్షత వహించారు. సింగూర్ డ్యాం హైదరాబాద్ నగరానికి తాగునీరు సరఫరా చేయడమే కాకుండా పరిసర ప్రాంతాలకు సాగునీటి వనరుగా నిలుస్తోందని, అందువల్ల డ్యాం భద్రత అత్యంత ప్రాధాన్యమని మంత్రి పేర్కొన్నారు. త్వరలోనే ప్రాజెక్టు స్థలాన్ని స్వయంగా సందర్శించి పనుల పురోగతిని పరిశీలిస్తానని తెలిపారు.

**నీటిమట్టం తగ్గించకుండా పరిశీలనలు**

రిజర్వాయర్‌లో నీటిమట్టం తగ్గించకుండా సోనార్ సర్వేలు, నీటిలోపలి పరిశీలనలు నిర్వహించి నిర్మాణ పరమైన లోపాలను అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. మూడు రోజుల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు. 2025 మధ్య కాలం నుంచి నిర్వహించిన సాంకేతిక అంచనాల్లో ఎంబాంక్‌మెంట్‌లో చీలికలు, వాలువైపుల ఇరోషన్, రేవెట్‌మెంట్ నిర్మాణాల నష్టం, ప్లంజ్ పూల్ ప్రాంతంలో సమస్యలు గుర్తించినట్లు సమాచారం.సింగూర్ రిజర్వాయర్ స్థూల నిల్వ సామర్థ్యం 29.91 టీఎంసీలు కాగా, ప్రతీ ఏడాది సుమారు 7 టీఎంసీల తాగునీటిని హైదరాబాద్‌కు సరఫరా చేస్తోంది.

**కాల్వ లైనింగ్ పనులకు వేగం**

మొత్తం 13 కిలోమీటర్ల కాల్వలో

మిగితా 2వ పేజీలో



# రాజ్యసభకు వేం నరేందర్‌రెడ్డి..

- మరో సీటు సింఘ్వీకే

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డికి రాజ్యసభ సీటు ఖరారైంది. ఈ మేరకు కాంగ్రెస్ అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రం నుంచి ప్రస్తుతం రెండు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్న సంగతి తెలిసిందే. వీటిలో ఒకదానికి బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ స్పీకర్ కే.సురేశ్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తుండగా.. మరోదానికి అభిషేక్ సింఘ్వీ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అసెంబ్లీలో సంఖ్యాబలం రీత్యా ఈ రెండూ కాంగ్రెస్ ఖాతాలోనే పడనున్నాయి. కాగా సింఘ్వీని తెలంగాణ నుంచే మరోసారి పెద్దల సభకు పంపాలని నిర్ణయించిన ఏఐసీసీ పెద్దలు, ఆ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌కు సమాచారమిచ్చారు. ఇక రెండో స్థానాన్ని వేం నరేందర్‌రెడ్డికి ఖరారు చేశారు.ఆయనతోపాటు సింఘ్వీ గురువారం నామినేషన్లు దాఖలు చేయనున్నట్టు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

# వేసవి దృష్ట్యా ఒకేసారి మూడు నెలల రేషన్

- పంపిణీకి కేంద్రం సూచనలు
- ఏప్రిల్‌లోనే ఏప్రిల్--మే--జూన్ బియ్యం అందజేయాలని రాష్ట్రాలకు లేఖలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని రేషన్ కార్డు లబ్ధిదారులకు మూడు నెలల సరుకులను ఒకేసారి పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన బియ్యాన్ని ఏప్రిల్ నెలలోనే అందించేందుకు చర్యలు చేపట్టాలని కేంద్ర పౌర సరఫరాల శాఖ దేశంలోని అన్ని రాష్ట్రాలకు లేఖలు రాసింది.


మార్చి తొలి వారంలోనే ఎండలు తీవ్రరూపం దాల్చడంతో రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. భానుడి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రజలు తరచూ రేషన్ దుకాణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

మూడు నెలల కోటాను ఒకేసారి ఇవ్వాలని కేంద్రం సూచించిన నేపథ్యంలో రాష్ట్రంలో సరిపడా బియ్యం నిల్వలు ఉన్నాయా? ఒకే నెలలో పంపిణీ సాధ్యమా? అనే అంశాలను తెలంగాణ ప్రభుత్వం పరిశీలిస్తోంది. గతంలో కూడా ఒకేసారి మూడు నెలల బియ్యం పంపిణీ చేసిన సందర్భాలు ఉన్నాయి. గత వర్షాకాలంలో ఒకే నెలలో మూడు నెలల కోటాను పంపిణీ చేయగా, లబ్ధిదారులు, డీలర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తే రవాణా ఖర్చులు తగ్గే అవకాశం ఉన్నప్పటికీ, నిల్వ సామర్థ్యం పెద్ద సవాల్‌గా మారిందని రేషన్ డీలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మిగితా 2వ పేజీలో

# మక్కల కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలి

- రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



**బలగం టీవీ, సిద్దిపేట**

తెలంగాణలో అవసరమైన అన్ని ప్రాంతాల్లో మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొంటూ ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు కాంగ్రెస్ పాలనలో గిట్టుబాటు లేకుండా పోయిందన్నారు. దుకాణాల్లో ఇవ్వాల్సిన యూరియాను యాప్‌ల ద్వారా అందిస్తామని ఆర్భాటంగా ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆ విషయంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కోతల దశకు చేరుకున్నా పంట పెట్టుబడి సాయం అందించలేని దుస్థితి నెలకొన్నదని అన్నారు.

పండించిన పంటను అమ్ముకునే సమయంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఆలస్యం, కొన్ని ప్రాంతాల్లో అసలు ఏర్పాటు చేయకపోవడం, చెల్లింపుల్లో జాప్యం, రవాణా సదుపాయాల లేమి వంటి సమస్యలు రైతులను ఆర్థికంగా కుదేలు చేస్తున్నాయని పేర్కొన్నారు.

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం ఆరేపల్లి (అక్కెనపల్లి) గ్రామంలో సుమారు 350 ఎకరాల్లో మక్క సాగు చేస్తున్న రైతులు ప్రతి ఏటా నష్టపోతున్నారని, అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. దీంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరలకు పంట అమ్మాల్సి వస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మక్కల కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేసి, కనీస మద్దతు ధర చెల్లించి రైతుల నుంచి పంట కొనుగోలు చేయాలని హరీశ్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# యుద్ధం రాబోయే తరాలకు విషాదాన్ని మాత్రమే మిగుల్చుతుంది

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- బాలికల పాఠశాలపై బాంబుదాడి ఘటనపై ఆవేదన



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఇరాన్‌పై దాడుల నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌స్పందించారు. ఇరాన్‌లోని ఓ బాలికల పాఠశాలపై జరిగిన బాంబు దాడిలో 165 మంది బాలికలు మృతి చెందిన ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. శిథిలాల కింద చిక్కుకుని ప్రాణాలు కోల్పోయిన ఆ బాలికల అంత్యక్రి యలు విషాద వాతావరణంలో జరిగాయని పేర్కొన్నారు. "పాఠశాలపై ఇజ్రాయెల్, అమెరికా బలగాలు జరిపిన దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన 165 మంది బాలికల అంత్యక్రియలకు సంబంధించిన భయంకరమైన, మనసును కలచివేసే దృశ్యాలు" అంటూ సామూహిక సమాధుల చిత్రాలను తన అధికారిక ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. యుద్ధానికి వివిధ కారణాలు చూపించినా, ఇది చివరికి మనిషి సృష్టించిన విషాదమేనని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఈ యుద్ధం రాబోయే తరాలకు బాధ, విషాదాన్ని మాత్రమే మిగిల్చుతుందని తన పోస్టులో పేర్కొన్నారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఘర్షణలు ప్రపంచవ్యాప్తంగా ఆందోళనకు దారితీస్తున్నాయి.

# మరింత ముదురుతున్న ఉద్రిక్తతలు



- అమెరికా--ఇజ్రాయెల్ స్థావరాలపై 17వ విడత దాడులు
- 'అమెరికా యుద్ధనౌకపై దాడి చేశాం : ఐఆర్‌జీసీ

**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పరాకాష్ఠకు చేరుకున్నాయి. ఇరాన్ సైనిక విభాగం Islamic Revolutionary Guard Corps (ఐఆర్‌జీసీ) బుధవారం దాడులను తీవ్రతరం చేసినట్లు ప్రకటించింది. అమెరికా, ఇజ్రాయెల్ స్థావరాలపై 17వ విడత దాడులు ప్రారంభించినట్లు వెల్లడిస్తూ, దీనిని 'ఆపరేషన్ ట్రూ ప్రామిస్--4'గా పేర్కొంది. ప్రపంచ ఇంధన రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిపై పూర్తి నియంత్రణ తమకే ఉందని ఐఆర్‌జీసీ ప్రకటించింది. ఈ మార్గంలో ప్రయాణించే నౌకలను ధ్వంసం చేస్తామని హెచ్చరించింది. అమెరికా సైన్యం చమురు నౌకలకు రక్షణ కల్పిస్తుందని మాజీ అధ్యక్షుడు ఐశీఅఖ్రీస ఎతీబఎజూ చేసిన వ్యాఖ్యలకు ఇది ప్రతిస్పందనగా భావిస్తున్నారు.

**'అమెరికా యుద్ధనౌకపై దాడి చేశాం'**

హిందూ మహాసముద్రంలో ఒక అమెరికా యుద్ధనౌకపై దాడి జరిపినట్లు ఐఆర్‌జీసీ తెలిపింది. ఇంధనం నింపుకుంటున్న సమయంలో దాడి జరగడంతో రెండు నౌకల్లో మంటలు చెలరేగినట్లు పేర్కొంది. ఖతార్, యూఏఈ, కువైట్, ఇరాక్‌లలోని అమెరికా స్థావరాలపై 230 డ్రోన్లతో దాడులు చేసినట్లు ప్రకటించింది. ఇజ్రాయెల్ లక్ష్యంగా 40 క్షిపణులు ప్రయోగించినట్లు వెల్లడించింది. గల్ఫ్ దేశాల్లో ఇప్పటివరకు 8 మంది మృతిచెందినట్లు సమాచారం.ఇరాన్ ప్రతీకార దాడుల్లో 680 మందికిపైగా అమెరికన్ సైనికులు మృతిచెందినట్లు తమ నిఘా వర్గాల సమాచారం అని ఐఆర్‌జీసీ ప్రకటించింది. బహ్రెయిన్‌లోని కీలక అమెరికా వైమానిక స్థావరం

మిగితా 2వ పేజీలో

# అధికారులను బెదిరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

- రెండున్నరేళ్లలో పరిపాలనలో తీవ్ర అస్థిరత
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

**బలగం టీవీ, హైదరాబాద్**

డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో జరిగిన కలెక్టర్ల సమావేశంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను సీఎం బెదిరింపుల ధోరణిలో మాట్లాడారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, అధికారులను ఓపెన్‌గా హెచ్చరించే విధంగా సీఎం వ్యవహరించారని హరీశ్ రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత రెండున్నరేళ్లలో పరిపాలనలో తీవ్ర అస్థిరత నెలకొందని అన్నారు. ఐదుసార్లు కీలక స్థాయి అధికారుల బదిలీలు జరిగాయని, నాలుగు సార్లు జీహెచ్ఎంసీ కమిషనర్లను మార్చారని పేర్కొన్నారు. "ఒక అధికారి తన పరిధిలో పరిస్థితులను అర్థం చేసుకునేలోపే బదిలీ చేస్తున్నారు. ముఖ్యమంత్రి లేదా మంత్రి ఎవరికైనా అధికారి నచ్చకపోతే వెంటనే పక్కన పెడుతున్నారు. కొందరికి పోస్టింగ్‌లు ఇస్తూ, జాయినింగ్ ఆర్డర్లు ఇవ్వడం లేదని"

మిగితా 2వ పేజీలో

# బాలికల ఆశ్రమ కళాశాలలో ఫుడ్ పాయిజన్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఆకులవారి గణపురం ప్రాంతంలో ఉన్న గిరిజన బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం కలుషిత ఆహారం తిని సుమారు 10 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. అన్నం తిన్న విద్యార్థులు కొద్దిసేపటికే వాంతులు, విరోచనాలు చేసుకుంటుండటంతో ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులను సమీప ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. విద్యార్థులను పరీక్షించిన వైద్యులు ఫుట్ పాయిజన్ జరిగిందని, ప్రమాదం తప్పిందని తెలిపారు.

కళాశాల ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం వల్లనే విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయిందని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సోడి అశోక్ తెలిపారు. విషయం తెలుసుకున్న వెంటనే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అశోక్ ప్రభుత్వాస్పత్రికి వెళ్లి విద్యార్థులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రిన్సిపాల్ విద్యార్థుల పట్ల పూర్తి నిర్లక్ష్యంగా ఉంటుందని తెలిసిందన్నారు. కూరగాయలు, కోడిగుడ్లు కుళ్లిపోయిన వాటిని వండి పెట్టడంతోనే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని తెలిపారు. సంబంధిత అధికారులు కళాశాలపై దృష్టి పెట్టకపోవడంతోనే కళాశాల ప్రిన్సిపాల్ తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్, ఐటీడీఏ పీఓ స్పందించి ప్రిన్సిపాల్‌ని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

# భద్రత ఖర్చు కాదు, పెట్టుబడి

- **జీరో యాక్సిడెంట్ లక్ష్యంగా పరిశ్రమలు ముందుకు రావాలి**
- **మంత్రి వివేక్**

**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో 55వ జాతీయ భద్రతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం, ఫ్యాక్టరీస్ డైరెక్టరేట్ మరియు నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రిన్సిపల్ సెక్రటరీ దానికిషోర్, ఫ్యాక్టరీస్ డైరెక్టర్ మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.మంత్రి మాట్లాడుతూ జాతీయ భద్రతా దినోత్సవం ప్రతి ఒక్కరికీ ఎంతో ముఖ్యమన్నారు. భద్రతను ఖర్చుగా కాకుండా పెట్టుబడిగా చూడాలని, భద్రత ఉన్నప్పుడే ఉత్పాదకత మెరుగవుతుందని స్పష్టం చేశారు.



గతంలో భద్రతా చర్యల వల్ల ఖర్చులు పెరుగుతాయని భావించిన మేనేజ్మెంట్లు, ప్రస్తుతం భద్రతపై దృష్టి పెడుతున్నాయని తెలిపారు.

**యాజమాన్యాల బాధ్యత కీలకం**

'ప్రతి పరిశ్రమ యాజమాన్యం భద్రతపై తప్పనిసరిగా పెట్టుబడి పెట్టాలి. బోర్డు సభ్యులు భద్రతా అంశాలను సమీక్షించాలి కార్మికులకు నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. కార్మికులు సంతోషంగా, సురక్షితంగా ఉంటేనే ఉత్తమ ఫలితాలు సాధ్యం' అని మంత్రి పేర్కొన్నారు.

పరిశ్రమల్లో సాంకేతిక మార్పులు వేగంగా జరుగుతున్న నేపథ్యంలో భద్రతా ప్రమాణాలను బలోపేతం చేయాలని సూచించారు. రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంలో పరిశ్రమల పాత్ర కీలకమని అన్నారు. పరిశ్రమలు "జీరో యాక్సిడెంట్ ఫ్యాక్టరీలు"గా మారాలని, ఉత్తమ భద్రతా పద్ధతులను అనుసరించాలని పిలుపునిచ్చారు. ఒక ఫ్యాక్టరీ ఘటనను ఉదాహరణగా చెబుతూ, చిన్నచిన్న జాగ్రత్తలు తీసుకున్నా పెద్ద ప్రమాదాలు నివారించవచ్చని తెలిపారు. "రూ.20 లక్షలు ఖర్చు చేసి ఉంటే ప్రమాదం జరిగేది కాదు. కానీ ఘటన అనంతరం అదే మేనేజ్మెంట్ కోట్లు ఖర్చు చేసింది" అని వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమల్లో భద్రతా సంస్కృతిని మరింత బలోపేతం చేయాలని శాఖాధికారులకు మంత్రి ఆదేశించారు.

## సింగూర్ ప్రాజెక్టు కాల్వ పనులు

# జూన్ 26లోపు పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

9 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. మిగిలిన 4 కిలోమీటర్ల పనులను జూన్ 26లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. పంటలకు అంతరాయం కలగకుండా ఒకే పని సీజన్‌లో మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు.

**లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి డీపీఆర్‌లు**

అందోల్ నియోజకవర్గంలో ప్రతిపాదిత పెద్దారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలు (డీపీఆర్‌లు) త్వరితగతిన సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని మంత్రి ఆదేశించారు. వచ్చే నెల ఉగాది సందర్భంగా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది.

**భూసేకరణకు రూ. 5,000 కోట్లు**

రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ కోసం రూ. 5,000 కోట్లు విడుదల చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియలను జూన్ 2లోపు వేగవంతం చేయాలని గడువు నిర్దేశించారు. పాలెం వాగు వద్ద ఉన్న సాంకేతిక సమస్యలను పరిష్కరించేందుకు క్షేత్రస్థాయి సమీక్షలు నిర్వహించాలని కూడా ఆదేశించారు. ఈ సమావేశంలో ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మరింత ముదురుతున్న ఉద్రిక్తతలు

(మొదటి పేజీ తరువాయి)

తీవ్రంగా దెబ్బతిందని పేర్కొంది.అమెరికా సెంట్రల్ కమాండ్ చీఫ్ అడ్మిరల్ Brad Cooper దాడులు కొనసాగుతాయని స్పష్టం చేశారు. అమెరికా--ఇజ్రాయెల్ సంయుక్త బలగాలు ఇరాన్‌లో నిరంతరం దాడులు నిర్వహిస్తున్నాయని తెలిపారు. బీ-2, బీ-1, బీ-52 బాంబర్లతో క్షిపణి కేంద్రాలు, కమాండ్ పోస్టులపై దాడులు చేశామని వెల్లడించారు. ఇప్పటివరకు 17 ఇరానీ నౌకలను ధ్వంసం చేశామని పేర్కొన్నారు. అరేబియన్ గల్ఫ్, హర్మూజ్, గల్ఫ్ ఆఫ్ ఒమన్ ప్రాంతాల్లో ప్రస్తుతం ఒక్క ఇరానీ నౌక కూడా సంచరించడం లేదన్నారు.

**టెహ్రాన్‌లో అణు కేంద్రంపై దాడి**

ఇరాన్ రాజధాని టెహ్రాన్ శివార్లలోని 'మిన్జా దేహై' అణు తయారీ కేంద్రాన్ని ధ్వంసం చేశామని క్ష్మీంతీఖువశ్రీ ఐవటవఅంవ ఖీశీతీషవం (ఐడీఎఫ్) ప్రకటించింది. ఐడీఎఫ్ అధికార ప్రతినిధి ఎఫ్ఫీ డెఫ్రిన్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఈ కేంద్రంలో అణ్వస్త్ర తయారీకి సంబంధించిన రహస్య పరిశోధనలు జరుగుతున్నాయని తెలిపారు. కొంత భాగం భూగర్భంలో ఉన్నట్లు వెల్లడించారు. 2025లో ప్రారంభించిన 'ఆపరేషన్ రైజింగ్ లయన్' అనంతరం ఇరాన్ ఈ కేంద్రంలో కార్యకలాపాలు ముమ్మరం చేసిందని పేర్కొన్నారు. గత 24 గంటల్లో ఇరాన్, లెబనాన్ ప్రాంతాల్లో వందలాది లక్ష్యాలపై దాడులు జరిపామని, ఫిబ్రవరి 28 నుంచి ఇప్పటివరకు 300కుపైగా మిస్సైల్ లాంచింగ్ ప్యాడ్‌లను ధ్వంసం చేశామని ఐడీఎఫ్ వెల్లడించింది.

**60 హిజ్బుల్లా స్థావరాలు ధ్వంసం**

లెబనాన్ దక్షిణ ప్రాంతంలో 60 హిజ్బుల్లా స్థావరాలను ధ్వంసం చేశామని ఐడీఎఫ్ పేర్కొంది. ఆయుధ గిడ్డంగులు, మిస్సైల్ లాంచర్లు, కమాండ్ సెంటర్లపై దాడులు జరిపినట్లు తెలిపింది.ఇది ఆరంభం మాత్రమేనని, ఇరాన్‌పై దాడులను ఆపేది లేదని

అడ్మిరల్ బ్రాడ్ కూపర్ స్పష్టం చేశారు. తమ సైనిక లక్ష్యాలన్నీ నెరవేరేవరకు ఆపరేషన్ కొనసాగుతుందని తెలిపారు. పశ్చిమాసియాలో పరిస్థితి రోజురోజుకు మరింత ఉద్రిక్తంగా మారుతోంది.

# ఎంబీబీఎస్ విద్యార్థులకు చెక్కులు అందజేసిన కేటీఆర్

- **ఉప్పల్ నియోజకవర్గంలోని 16 మంది విద్యార్థులకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆర్థిక సహాయం**

**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్ ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థులకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేయూత అందించారు. బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 16 మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు ఆర్థిక సహాయం మంజూరు చేశారు. ఈ సందర్భంగా సంబంధిత చెక్కులను బుధవారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి నివాసంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అందజేశారు.


ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ దీక్ష్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వైద్య విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల ఉన్నత విద్యకు ఇలాంటి చేయూత ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## యంగ్ ఇండియా స్కూల్స్‌లో జరిగిన అవినీతి అంతా ఇంతా కాదు..

- **అన్ని ఆధారాలు ఉన్నాయి..**
- **మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు**

**బలగం టీవీ, హైదరాబాద్**



యంగ్ ఇండియా స్కూల్స్‌లో భారీ స్థాయిలో అవినీతి జరిగిందని, అన్ని ఆధారాలు తమ వద్ద ఉన్నాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావుపేర్కొన్నారు. త్వరలో పూర్తి వివరాలతో ప్రజల ముందుకు వస్తామని తెలిపారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ప్రభుత్వం పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎవరికి ఎక్కువ టెండర్లు ఇచ్చారో సహా అన్ని వివరాలు బయటపెడతామని చెప్పారు. రాష్ట్ర పరిపాలనపై ముఖ్యమంత్రికి పట్టు లేదని విమర్శించారు. ప్రతిపక్షంగా తాము ప్రభుత్వాన్ని స్పందించేలా చేస్తున్నామని పేర్కొన్నారు.

ఖమ్మం పర్యటనలో కేటీఆర్ వెళ్లిన తర్వాతే ప్రభుత్వం స్థలాలు ఇస్తామని, ఇళ్లు కట్టిస్తామని ప్రకటించిందన్నారు. తాను శారదా పీఠాన్ని సందర్శించిన వెంటనే ప్రభుత్వం స్పందించిందని చెప్పారు. దేవాదుల ప్రాజెక్టు, హెల్త్ సిటీ వంటి అంశాల్లో కూడా తాము వెళ్లిన తర్వాతే చర్యలు తీసుకుంటున్నారని ఆరోపించారు. జర్నలిస్టుల హెల్త్ స్కీంను ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. తమ ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రత్యేక జీవో జారీ చేసి ఉద్యోగులకు ఉన్న సదుపాయాలే జర్నలిస్టులకు కల్పించామని గుర్తుచేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేనల్లుడికి చెందిన వ్యక్తులు నియోపోలీస్‌లో అక్రమ మైనింగ్ చేస్తున్నారని ఆరోపించారు. మొబైల్ క్రషింగ్ ప్లాంట్‌కు మాత్రమే అనుమతి ఉండగా, నిబంధనలకు విరుద్ధంగా ఫిక్స్ క్రషింగ్ ప్లాంట్ ఏర్పాటు చేశారని తెలిపారు. ల్యాండ్ లీజ్‌పై 6 నుండి 7 శాతం ఫీజు చెల్లించాల్సి ఉండగా, నిబంధనలు ఉల్లంఘించారని అన్నారు. అధికారిక లేఖలో 10 ఎకరాలు కేటాయించగా, 15 ఎకరాల్లో మైనింగ్ జరుగుతోందని ఆరోపించారు. 15 లక్షల క్యూబిక్ మీటర్ల రాయికి సంబంధించిన ఫీజులను ఎగ్గొట్టారని చెప్పారు. అక్కడ రెడీమిక్స్ ప్లాంట్‌కు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఈ ఆరోపణలపై ప్రభుత్వం స్పందించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

# నేడు ఎస్ఎస్‌సీ హాల్‌టికెట్లు విడుదల..!

(మొదటి పేజీ తరువాయి)

వాట్సాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అది సాధ్యం కానట్లయితే పాఠశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించి నేరుగా హాల్‌టికెట్ పొందవచ్చు. విద్యార్థులు ఏ రూపంలో పొందిన హాల్‌టికెట్‌తో పరీక్ష కేంద్రాలకు వచ్చినా పరీక్షలకు అనుమతిస్తామని అధికారులు స్పష్టం చేశారు.

**మార్చి 14 నుంచి పరీక్షలు**

రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు నిర్వహించనున్నారు. ఈ ఏడాది మొత్తం 5,28,248 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇదిలా ఉండగా Andhra Pradesh రాష్ట్రంలో ఇప్పటికే పదో తరగతి పబ్లిక్ పరీక్షల హాల్‌టికెట్లు విడుదలయ్యాయి. అక్కడ పరీక్షలు మార్చి 16 నుంచి ప్రారంభమవనున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ నెల మధ్యభాగం నుంచే పదో తరగతి పరీక్షల సందడి మొదలుకానుంది.

# వేసవి దృష్ట్యా ఒకేసారి మూడు నెలల రేషన్

(మొదటి పేజీ తరువాయి)

అంతేకాకుండా ప్రతి లబ్ధిదారుడు మూడు నెలల కోటా పొందాలంటే ఒకేసారి మూడు సార్లు వేలిముద్రలు ఇవ్వాల్సి ఉండటంతో సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశముంది. సర్వర్ సమస్యల కారణంగా ఒక్కో కార్డుకు 15--20 నిమిషాల సమయం పడుతోందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఏర్పడే సమస్యలను ముందుగానే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని భావిస్తున్నారు.

# అధికారులను బెదిరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

ఆయన ఆరోపించారు. రాష్ట్ర పరిపాలనను సక్రమంగా నిర్వహించలేకపో తున్నారని సీఎం పై విమర్శలు గుప్పించిన హరీశ్ రావు, కాంగ్రెస్ నాయకుల అవినీతి వ్యవహారాలను త్వరలోనే బహిర్గతం చేస్తానని హెచ్చరించారు. వారి బినామీల వివరాలను బయటపెడతానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా (బీఆర్ఎస్) ప్రభుత్వం కాలంలో పరిపాలన స్థిరంగా సాగిందని, ప్రస్తుతం అధికారులపై ఒత్తిడి పెరిగిందని ఆయన పేర్కొన్నారు.

# స్పీకర్ నుంచి ఎటువంటి నోటీసు రాలేదు

- **ఎమ్మెల్యే దానం నాగేందర్**

**బలగం టీవీ, హైదరాబాద్**

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నుంచి తనకు ఎటువంటి నోటీసు రాలేదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో నిర్వహించిన హోలీ వేడుకల్లో దానం నాగేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఉత్సాహంగా నృత్యం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, తన అనర్హత పిటిషన్‌కు సంబంధించి గురువారం (5వ తేదీ)న హాజరుకావాలని స్పీకర్ నుంచి ఎటువంటి నోటీసు అందలేదన్నారు.

దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌పై గురువారం స్పీకర్ ఇరుపక్షాల (పిటిషనర్, రెస్పాండెంట్లు) వాదనలు విననున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే దానం తనకు నోటీసు రాలేదని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న కడియం శ్రీహరి, దానం నాగేందర్ అనర్హత పిటిషన్లపై ఈ నెల 10వ తేదీలోగా విచారణ పూర్తి చేసి తీర్పు ఇవ్వనున్నారన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. ఇక స్పీకర్‌పై దాఖలైన ధిక్కరణ పిటిషన్‌పై సుప్రీం కోర్టు ఈ నెల 12న విచారణ చేపట్టనుంది. ధిక్కరణ పిటిషన్ విచారణకు ముందే స్పీకర్ తీర్పు వెలువరించే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# ప్రాణాల కోసం పోరాడుతున్న పదేండ్ల సహస్ర..

- లివర్ వ్యాధితో బాధపడుతున్న చిన్నారి
- చిన్న సహాయం... ఒక ప్రాణానికి నూతన జీవితం
- చికిత్స కోసం రూ.30లక్షలు అత్యవసరం
- మనసున్నవారి చేయూత కోసం వేచిచూస్తున్న తల్లిదండ్రులు



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సిరిసిల్ల పట్టణానికి చెందిన ఒక పేద నేత కార్మికుడి కుటుంబం ప్రస్తుతం తీవ్ర విషాదంలో ఉంది. తమ పదేళ్ల కుమార్తె ప్రాణాపాయ స్థితిలో ఉండటంతో, ఆ బిడ్డను కాపాడుకోవడానికి దాతల సాయం కోసం ఆ తల్లిదండ్రులు ఆర్తిగా ఎదురుచూస్తున్నారు.

సిరిసిల్ల పట్టణం 34వ వార్డుకు చెందిన అంబటి వేణు వృత్తిరీత్యా నేత కార్మికుడు. ఆయన భార్య బీడీలు చుడుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వీరి కుమార్తె అంబటి సహస్ర (10) గత కొంతకాలంగా తీవ్రమైన లివర్ వ్యాధితో బాధపడుతోంది. మెరుగైన చికిత్స కోసం ఆమెను హైదరాబాద్‌లోని రెయిన్‌బో చిల్డ్రన్ హాస్పిటల్‌కు తరలించగా, వైద్యులు పరీక్షించి చిన్నారికి అత్యవసరంగా లివర్ మార్పిడి శస్త్రచికిత్స అవసరమని తెలిపారు. ఈ శస్త్రచికిత్సకు సుమారు రూ.30 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు అంచనా వేశారు. ఇప్పటికే అప్పులు చేసి రూ.5 లక్షల వరకు చికిత్స కోసం ఖర్చు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రోజువారీ కూలీ పనులపై ఆధారపడే ఆ కుటుంబానికి మిగిలిన మొత్తం సమకూర్చడం అసాధ్యంగా మారింది. మా కళ్లముందే బిడ్డ మంచాన పడి ఉంది. మేము ఎంతో ప్రయత్నించినా అంత పెద్ద మొత్తం సమకూర్చ లేకపోతున్నాం. దయచేసి దాతలు ముందుకు వచ్చి మా బిడ్డ ప్రాణాలను కాపాడాలి" అని తండ్రి అంబటి వేణు కన్నీటి పర్యంతమై వేడుకుంటున్నారు. సహాయం చేయాలనుకునే దాతలు ఫోన్‌పే నంబర్లు 9912231674 లేదా 9676260746 కు ఆర్థిక సాయం పంపించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. మనసున్న వారు ముందుకు వచ్చి చిన్నారి సహస్రకు ప్రాణదానం చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# బోయినపల్లి కేజీబీవీని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ..

- విద్యార్థులతో కలిసి.. భోజనం చేసిన కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, బోయినపల్లి:**

బోయినపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) ను కలెక్టర్ గరిమ అగ్రవాల్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిచెన్, వంట గది, బియ్యం, పప్పులు, గుడ్లు ఇతర ఆహార పదార్థాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజన సమయం కావడంతో మెనూ పరిశీలించి.. కలెక్టర్ ప్లేట్ తీసుకొని భోజనం తీసుకుని విద్యార్థులతో కలిసి కింద కూర్చొని తిన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? అని ఆరా తీశారు. ఈ రోజు తింటున్న ఆహారంలో విటమిన్లు, ప్రోటీన్లు, కార్బోహైడ్రేడ్స్ ఏమి ఉన్నాయో ప్రశ్నించారు? రోజూ ఎంత పరిమాణంలో తీసుకోవాలి.. విద్యార్థులు వార్షిక పరీక్షలకు ఎలా సిద్ధం అవుతున్నారని ప్రశ్నించారు? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. అనంతరం విద్యాలయం పై అంతస్తులో నిర్మిస్తున్న గదులు, టాయిలెట్లు ఇతర పనులపై



ఉపాధ్యాయుల నుంచి కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు.

పదో తరగతి, ఇతర తరగతుల విద్యార్థులు ప్రతి సబ్జెక్ట్ కు సంబంధించి అన్ని పాఠాలు చదవాలి.. రాయాలి అని సూచించారు. సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, లక్ష్యం నిర్దేశించుకొని ముందుకు వెళ్లాలని పిలుపు ఇచ్చారు. ఉద్యోగం లేదా వృత్తిలో స్థిరపడిన తర్వాత మిగతా విషయాలు ఆలోచించాలని దిశానిర్దేశం చేశారు.

# సిరిసిల్ల, వేములవాడలకు ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలి..

**జిల్లా ఎస్పీకి వినతి పత్రం ఇచ్చిన జిల్లా అధ్యక్షులు జాతీయ బీసీ సంక్షేమ సంఘం మ్యాకల పర్శరాములు**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్లా జిల్లా కేంద్రం అయిన సిరిసిల్లా మరియు పుణ్యక్షేత్రం అయిన వేములవాడ పట్టణాలలో రోజురోజుకు వాహన రాకపోకలు పెరుగుతున్న నేపథ్యంలో, ప్రజల సురక్షిత ప్రయాణం కోసం ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ ని కోరుతూ వినతి పత్రం సమర్పించినట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మ్యాకల పర్శరాములు తెలిపారు.

ప్రస్తుతం సిరిసిల్ల మరియు వేములవాడ పట్టణాల్లో ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, పాఠశాలలు, కళాశాలలు, మార్కెట్ ప్రాంతాలు, దేవాలయాల వద్ద వాహనాల రద్దీ అధికమవుతోందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా పుణ్యక్షేత్రం అయిన వేములవాడలో పండుగలు, ప్రత్యేక దినాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక విభాగం అవసరం ఉందని వివరించారు. అందువల్ల ప్రజల భద్రత, ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం సిరిసిల్లా మరియు వేములవాడ పట్టణాలలో ప్రత్యేక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని జిల్లా పోలీస్ శాఖను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు నాగారం కొమురవ్వ పాల్గొని.. మహిళలు, విద్యార్థులు, వృద్ధులు రోడ్లపై సురక్షితంగా ప్రయాణించేందుకు ఈ నిర్ణయం ఎంతో అవసరమని తెలిపారు. ప్రజల ప్రయోజనార్థం వెంటనే చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

# ఇల్లంతకుంట మండల ఉమ్మడి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా హోలీ సంబరాలు..

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**



ఇల్లంతకుంట మండల ఉమ్మడి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో రంగుల పండుగ హోలీ సంబరాలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించబడినవి. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొని పరస్పరం రంగులు చల్లి హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. హోలీ పండుగ సామరస్యానికి, స్నేహభావానికి ప్రతీక అని, సమాజంలో ఐక్యతను పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు ముఖ్య పాత్ర పోషిస్తాయని అన్నారు. పాత్రికేయులు సమాజానికి అద్దంలాంటి వారు అని, ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చే బాధ్యత తమపై ఉందని పేర్కొన్నారు. ఇల్లంతకుంట మండల ఉమ్మడి ప్రెస్ క్లబ్ తరపున మండల ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, సమాజంలో సఖ్యత, శాంతి, ఐక్యత నెలకొనాలని ఆకాంక్షించారు.



# రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉపాధి హామీ కూలీలపై తేనెటీగల దాడి..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

తెలంగాణ రాష్ట్రంలోని రాజన్న సిరిసిల్ల జిల్లాలో తేనెటీగల దాడి ఘటన చోటుచేసుకుంది. జిల్లాలోని కోనరావుపేట మండలం పరిధిలోని నిజామాబాద్ గ్రామం శివారులో కాలువ నిర్మాణ పనులు నిర్వహిస్తున్న ఉపాధి హామీ కూలీలపై తేనెటీగలు దాడి చేశాయి.

మంగళవారం ఉదయం దాదాపు 20 నుంచి 30 మంది ఉపాధి హామీ కూలీలు పనుల నిమిత్తం అక్కడికి చేరుకున్నారు. పనులు సాగిస్తున్న సమయంలో పక్కనే ఉన్న చెట్టుకు తేనెటీగల గూడు ఉండటాన్ని గమనించలేదు. ప్రమాదవశాత్తు పనిముట్లలో ఉపయోగించిన పారా చెట్టుకు తగలడంతో గూడు కదిలి, ఒక్కసారిగా తేనెటీగలు గుంపులుగా ఎగసి కూలీలపై దాడి చేశాయి. ఈ ఘటనలో ఏడుగురు కూలీలు గాయపడగా, మిగతా వారు అక్కడి నుంచి తప్పించుకున్నారు. గాయపడిన వారికి గ్రామంలో ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం సిరిసిల్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికు తరలించారు. ఆసుపత్రి డ్యూటీ డాక్టర్ తెలిపిన వివరాల ప్రకారం, గాయపడిన కూలీల పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని, ఎలాంటి ప్రాణాపాయం లేదని తెలిపారు. బాధితులకు అవసరమైన వైద్యం అందిస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.



# రాజకీయ లబ్ధి కోసం నేరెళ్ల బాధితులకు న్యాయం వాయిదా..

- నేరెళ్ల బాధితులకు న్యాయం చేయాలి
- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత టాప్ టెన్ ఇష్యూలలో నేరెళ్ల బాధితుల అంశం ఒకటని, దీనిని అడ్డం పెట్టుకొని న్యాయం చేయకుండా రాజకీయ లబ్ధి పొంది పొందడం సిగ్గుచేటని తీన్మార్ మల్లన్న అన్నారు. తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామంలో తొమ్మిది సంవత్సరాల క్రితం పోలీసుల థర్డ్ డిగ్రీకి గురైన బాధితులను పరామర్శించిన అనంతరం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మీడియాతో మాట్లాడుతూ.. నేరెళ్ల బాధితులను హింసించిన వారు ఇప్పటికీ పదవుల్లో కొనసాగుతున్నారని, వారిని వాడుకున్నవారు ప్రమోషన్లు పొందారని, కానీ బాధితులు మాత్రం న్యాయం కోసం ఎదురుచూస్తూ జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత పాలకులతో మీరు రాజీ పడ్డారా? లేదా బాధితులకు న్యాయం చేస్తారా? అనే అంశంపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.అలాగే, లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమారి ని తీసుకువచ్చి కాంగ్రెస్ పార్టీ రాజకీయ లబ్ధి పొందిందని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా బాధితులకు న్యాయం చేయలేకపోవడం సిగ్గుచేటని అన్నారు.




# వేల్జిపూర్ గ్రామానికి బస్సు సేవలను ప్రారంభించిన సర్పంచ్ నవీన్ కుమార్

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**

సిరిసిల్ల నుండి వెలిజిపూర్ మీదుగా ఇల్లంతకుంటకు నూతన బస్సు సేవలను మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సహకారంతో బస్సు సేవలను గ్రామ ప్రజలందరితో కలిసి ప్రారంభించినట్లు గ్రామ సర్పంచ్ నాయిని నవీన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ బస్సు సేవలను గ్రామ ప్రజలు వినియోగించి ఆక్యుపెన్సిని పెంచాలని కోరారు. గ్రామ ప్రజలు ఎమ్మెల్యే సత్యనారాయణ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌బి గుండ వెంకటేశం, గ్రామ శాఖ బిఅధ్యక్షులు గొల్లకోమటి శంకర్ యాదవ్ గారు, సీనియర్ నాయకులు మూల బాల్ రెడ్డి, బొల్లారం పరశురాములు గారు, వార్డ్ మెంబర్లు బొజ్జ శ్రీనివాస్, దేశెట్టి కవిత సంగేపు ముత్తవ్వ, వేములవాడ భారతి, బొల్లారం ప్రసన్నకుమార్ మరియు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు



## ‘ఉస్తాద్ భగత్ సింగ్’ పాటలకు డీఎస్పీ, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌కు థమన్

- **పవన్ కల్యాణ్ చిత్రానికి ఇద్దరు స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ల కాంబినేషన్**

**బలగం టీవీ, హైదరాబాద్**

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న భారీ చిత్రం ‘ఉస్తాద్ భగత్ సింగ్’పై క్రేజ్ రోజురోజుకు పెరుగుతోంది. దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తుండగా, రాశీ ఖన్నా కీలక పాత్రలో కనిపించనుంది. టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

ఈ చిత్రానికి సంగీత దర్శకుడిగా దేవీ శ్రీ ప్రసాద్ పనిచేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే విడుదలైన ‘దేఖ్ లేంగే సాలా’, ‘ఔరా ఆఫ్ ఉస్తాద్’ పాటలు నెట్టింట వైరల్‌గా మారాయి. అయితే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ విషయంలో డీఎస్పీ స్థానంలో ఎస్ థమన్ను తీసుకున్నారన్న వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో మైత్రీ మూవీ మేకర్స్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. ‘ఉస్తాద్ భగత్ సింగ్’ చిత్రానికి పాటలు దేవీ శ్రీ ప్రసాద్ స్వరపరుస్తుండగా, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌ను థమన్ అందించనున్నట్లు స్పష్టం చేసింది. ముందుగా ఉన్న కమిట్‌మెంట్ల కారణంగా డీఎస్పీకి సమయం దొరకకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

టాలీవుడ్‌లో టాప్ మ్యూజిక్ డైరెక్టర్లుగా గుర్తింపు పొందిన దేవీ శ్రీ ప్రసాద్, థమన్ ఇద్దరూ ఒకే చిత్రానికి పనిచేయడం అభిమానుల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. వీరిద్దరి స్టైల్‌కు ప్రత్యేక అభిమాన వర్గం ఉన్న సంగతి తెలిసిందే. అందువల్ల ఈ కాంబో అభిమానులకు ట్రిబుల్ ట్రీట్‌గా మారనుంది. ఇక గ్లింప్స్‌లో పవన్ కల్యాణ్ చెప్పిన డైలాగులు, ‘భగత్.. భగత్ సింగ్ మహంకాళి పోలీస్ స్టేషన్.. పత్తర్ గంజ్.. ఓల్డ్ సిటీ.. ఈసారి పర్ఫార్మెన్స్ బద్దలైపోద్ది’ వంటి సంభాషణలు సినిమాపై అంచనాలను మరింత పెంచాయి. ఇప్పటికే గబ్బర్ సింగ్ లాంటి బ్లాక్‌బస్టర్ ఇచ్చిన పవన్ కల్యాణ్--హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రం మార్చి 26న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## కొత్త జీవితాన్ని ప్రారంభించాం. మీ ఆశీర్వాదం కావాలి”

**బలగం టీవీ, హైదరాబాద్**



టాలీవుడ్ ప్రముఖులు విజయ్ దేవరకొండ--రష్మిక మందన్న జంట గత వారం రోజులుగా సామాజిక మాధ్యమాల్లో ట్రెండింగ్‌గా నిలుస్తోంది. ఇటీవల వివాహ బంధంలో అడుగుపెట్టిన ఈ జంట దేశవ్యాప్తం గా అభిమానులకు మిఠాయిల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి ప్రశంసలు అందుకుంది. అనంతరం విజయ్ స్వగ్రామంలో గృహప్రవేశం, పూజా కార్యక్రమాలు నిర్వహించి గ్రామస్థులు, అభిమానులను కలిశారు. తాజాగా హైదరాబాద్‌లో తెలుగు మీడియాతో ‘మీట్ ది ప్రెస్’ కార్యక్రమం నిర్వహించారు. సంప్రదాయ దుస్తుల్లో హాజరైన ఈ జంట మీడియాతో మర్యాదపూర్వకంగా ముచ్చటించింది.

తెలుగు మీడియా ఎప్పుడూ తనకు సొంత ప్రెస్‌లాగా అనిపిస్తుందని విజయ్ తెలిపారు. “మా కెరీర్ ప్రయాణాల్లో మీరు కూడా భాగమే. పెళ్లి చేసుకొని జంటగా మీ ముందుకు రావడం విభిన్న అనుభూతి. కొత్త జీవితాన్ని ప్రారంభించాం. మీ ఆశీర్వాదం కావాలి” అని పేర్కొన్నారు. రష్మిక మాట్లాడుతూ “కొత్త లైఫ్ ప్రారంభించాం. మీ అందరి ఆశీర్వాదం కావాలి” అని అన్నారు. “తెలుగు రాష్ట్రాలకు కొత్త కోడలు వచ్చింది. ఆమెను మంచిగా చూసుకోండి” అని విజయ్ నవ్వుతూ వ్యాఖ్యానించారు.

**ఉదయ్‌పూర్‌లో వివాహం -- హైదరాబాద్‌లో గ్రాండ్ రిసెప్షన్**

గత నెల 26న ఉదయ్‌పూర్లో కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో వీరి వివాహం జరిగింది. బుధవారం హైదరాబాద్‌లో గ్రాండ్ రిసెప్షన్ నిర్వహించనున్నారు. ఈ వేడుక తాజ్ కృష్ణా హోటల్‌లో జరగనుంది. టాలీవుడ్, శాండల్‌వుడ్, బాలీవుడ్ ప్రముఖులు, రాజకీయ నేతలు హాజరయ్యే అవకాశం ఉంది. పాసులు లేని అభిమానులు కార్యక్రమానికి రావద్దని జంట విజ్ఞప్తి చేసింది.

## కమల్-రజనీ కాంబో... వచ్చే ఏడాది సెట్స్‌పైకి

**బలగం టీవీ, హైదరాబాద్**

భారతీయ సినీ దిగ్గజాలు కమల్ హాసన్, రజనీకాంత్ 46 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ కలిసి నటిస్తున్న చిత్రం పై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. ‘జైలర్’ ఫేమ్ దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది సెట్స్‌పైకి వెళ్లనుంది.ఈ విషయాన్ని చిత్ర సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ వెల్లడించారు. ప్రస్తుతం కమల్ హాసన్, రజనీకాంత్ తమ తమ కమిట్‌మెంట్లను పూర్తి చేసిన అనంతరం ఈ ప్రాజెక్టులో చేరనున్నట్లు సమాచారం. ఈ లెజెండరీ కాంబినేషన్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఈ చిత్రాన్ని 80, 90 దశకాల్లో వినియోగించిన పాత ఫిల్మ్ కెమెరాలతో చిత్రీకరించాలన్న ఆలోచనలో దర్శకుడు నెల్సన్ ఉన్నారన్న ప్రచారం జరుగుతోంది. ప్రత్యేక గ్లింప్స్‌ను కూడా అదే విధంగా తెరకెక్కించాలనుకున్నప్పటికీ, సమయాభావం కారణంగా డిజిటల్ పద్ధతిలో పూర్తి చేసినట్లు సమాచారం. ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని రెడ్ జెయింట్ మూవీస్ నిర్మిస్తోంది. ఇటీవల విడుదలైన స్పెషల్ గ్లింప్స్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ఇద్దరు లెజెండ్స్ తమదైన శైలిలో కనిపించడంతో సినిమాపై హైప్ మరింత పెరిగింది.

# ఫైనల్‌కు దూసుకెళ్లిన న్యూజిలాండ్

- **సెమీఫైనల్లో సౌతాఫ్రికాపై 9 వికెట్ల ఘన విజయం**
- **ఫిన్ అలెన్ రికార్డు సెంచరీ**

**బలగం టీవీ, కోల్‌కతా**




టీ20 ప్రపంచకప్ తొలి సెమీఫైనల్లో న్యూజిలాండ్ అద్భుత ప్రదర్శనతో ఫైనల్‌కు దూసుకెళ్లింది. కోల్‌కతా వేదికగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన న్యూజిలాండ్ 9 వికెట్ల తేడాతో సౌతాఫ్రికాను చిత్తుగా ఓడించింది. పూర్తిగా ఏకపక్షంగా సాగిన ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా మూడు విభాగాల్లో విఫలమైంది.

ముందుగా బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 169 పరుగులు చేసింది. మార్కో యాన్సెన్ (30 బంతుల్లో 55 నాటౌట్; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) అజేయ హాఫ్ సెంచరీతో రాణించగా, డెవాల్డ్ బ్రెవిస్ (34), ట్రిస్టన్ స్టబ్స్ (29) పర్వాలేదనిపించారు. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. న్యూజిలాండ్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ (2/34), కోల్ మెక్‌కాంచీ (2/9), రచిన్ రవీంద్ర (2/29) రెండేసి వికెట్లు తీశారు. లాకీ ఫెర్గూసన్, జేమ్స్ నీషమ్ చెరో వికెట్ పడగొట్టారు.

170 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ దూకుడుగా ఆడింది. ఓపెనర్లు ఫిన్ అలెన్, టీమ్ సీఫెర్ట్ ఆరంభం నుంచే సౌతాఫ్రికా బౌలర్లపై విరుచుకుపడ్డారు. సీఫెర్ట్ ఇచ్చిన క్యాచ్‌ను వికెట్ కీపర్ క్వింటన్ డికాక్ వదిలేయడంతో న్యూజిలాండ్‌కు ఊపొచ్చింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న సీఫెర్ట్ 33 బంతుల్లో 58 పరుగులతో హాఫ్ సెంచరీ సాధించాడు.

**ఫిన్ అలెన్ రికార్డు సెంచరీ**

మరోవైపు ఫిన్ అలెన్ 33 బంతుల్లోనే 10 ఫోర్లు, 8 సిక్స్‌లతో అజేయంగా 100 పరుగులు చేసి రికార్డు సృష్టించాడు. మార్కో యాన్సెన్ వేసిన 13వ ఓవర్‌లో వరుస బౌండరీలతో సెంచరీ పూర్తి చేసిన అలెన్, టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే వేగవంతమైన సెంచరీ సాధించిన బ్యాటర్‌గా నిలిచాడు. తొలి వికెట్‌కు 117 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన ఈ జోడీ మ్యాచ్‌ను పూర్తిగా ఏకపక్షం చేసింది. న్యూజిలాండ్ 12.5 ఓవర్లలోనే ఒక వికెట్ నష్టానికి 173 పరుగులు చేసి విజయం సాధించింది. సౌతాఫ్రికా బౌలర్లలో కగిసో రబడా మాత్రమే ఒక వికెట్ తీశాడు.

గురువారం భారత్--ఇంగ్లండ్ మధ్య జరిగే రెండో సెమీఫైనల్ విజేతతో న్యూజిలాండ్ ఆదివారం అహ్మదాబాద్ వేదికగా ఫైనల్ ఆడనుంది.

## సెమీఫైనల్‌కు ముందు సిద్ధివినాయక ఆలయంలో భారత క్రికెటర్ల ప్రార్థనలు

**బలగం టీవీ, ముంబై**



ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 సెమీఫైనల్ పోరుకు ముందు భారత పురుషుల క్రికెట్ జట్టు సభ్యులు ముంబైలోని శ్రీ సిద్ధివినాయక గణపతి దేవాలయాన్ని బుధవారం సందర్శించి శ్రీ గణేశుడికి ప్రత్యేక పూజలు చేశారు. గురువారం ఇంగ్లాండ్‌తో జరగనున్న కీలక మ్యాచ్‌కు ముందు దైవ ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆటగాళ్లు అక్షర్ పటేల్, ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ ఆలయంలో దర్శనం చేసుకుని ప్రార్థనలు చేశారు. టోర్నీలో అత్యంత కీలకమైన సెమీఫైనల్ మ్యాచ్‌కు సిద్ధమవుతున్న తరుణంలో ఈ సందర్శన ప్రాధాన్యత సంతరించుకుంది. భారత్--ఇంగ్లాండ్ మధ్య సెమీఫైనల్ పోరు ముంబైలోని ప్రఖ్యాత వాంఖడే స్టేడియంలో గురువారం జరుగనుంది. మ్యాచ్‌కు ముందు జట్టు సభ్యులు ఆధ్యాత్మిక ఆశీస్సులు పొందడం అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచింది.

## ‘మేడ్ ఇన్ కొరియా’ ట్రైలర్ విడుదల...

- **మార్చి 12 నుంచి స్ట్రీమింగ్**

**బలగం టీవీ, హైదరాబాద్**




ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ తన కొత్త వెబ్ సిరీస్ ‘మేడ్ ఇన్ కొరియా’ ట్రైలర్‌ను బుధవారం విడుదల చేసింది. యువ నటి ప్రియాంక అరుళ్ మోహన్ ప్రధాన పాత్రలో నటించిన ఈ సిరీస్, ఒక తమిళ యువతి కొరియాలో సాగించిన జీవిత ప్రయాణాన్ని ఆవిష్కరించనుంది. మార్చి 12 నుంచి ఈ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది.ట్రైలర్ ప్రకారం, తమిళనాడులోని ఓ చిన్న పట్టణానికి చెందిన ‘షెంబ’ అనే యువతి దక్షిణ కొరియా రాజధాని సియోల్కు వెళ్లుతుంది. కొత్త ప్రదేశం, తెలియని మనుషుల మధ్య ఆమె తన వ్యక్తిత్వాన్ని ఎలా నిర్మించుకుంది, ఎలాంటి సవాళ్లను ఎదుర్కొంది అనేదే కథాకథనం. కలల ప్రయాణంలో ఎదురైన అనూహ్య మలుపులు, కొత్త పరిచయాలు షెంబ జీవితాన్ని ఎలా మలిచాయో ఈ సిరీస్‌లో చూపించనున్నారు. ఈ సిరీస్‌పై ప్రియాంక మోహన్ మాట్లాడుతూ, “షెంబ పాత్ర నా మనసుకు చాలా దగ్గరైంది. అనిశ్చితిలో ధైర్యాన్ని కనుగొని, సొంతంగా నిలబడటాన్ని నేర్చుకోవడం ఈ కథలో ప్రధానాంశం. నెట్‌ఫ్లిక్స్‌తో నా తొలి ప్రాజెక్ట్ కావడం ఎంతో ప్రత్యేకం” అని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులకు ఈ కథ కనెక్ట్ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రైజ్ ఈస్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మించిన ఈ డ్రామాకు రా. కార్తీక్ దర్శకత్వం వహించడంతో పాటు కథను కూడా అందించారు. ప్రియాంక మోహన్‌తో పాటు దక్షిణ కొరియా నటులు పార్క్ హే జిన్, నో హో జిన్ కీలక పాత్రల్లో నటించారు.‘మేడ్ ఇన్ కొరియా’ సిరీస్ తమిళంతో పాటు తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో మార్చి 12 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులోకి రానుంది.

## హోలీ సందర్భంగా ‘క్రేజీ కళ్యాణం’ ఫస్ట్ లుక్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**



మెగాఫోన్ పట్టి సినిమాలు తెరకెక్కిస్తూనే నటుడిగానూ వరుస ప్రాజెక్టులతో దూసుకెళ్తున్న యువ దర్శకుడు తరుణ్ భాస్కర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం ‘క్రేజీ కళ్యాణం’ నుంచి హోలీ పండుగను పురస్కరించుకుని చిత్రబృందం ఆసక్తికర అప్‌డేట్ విడుదల చేసింది. ఈ చిత్రంలో తరుణ్ భాస్కర్ పోషిస్తున్న ‘బాలరాజు’ పాత్ర ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. పోస్టర్‌లో ఆయన ‘సూపర్ మ్యాన్’ గెటప్‌లో సందడి చేస్తూ కనిపించడం విశేషం. ఈ లుక్‌తో సినిమాలో ఆయన పాత్ర ఫన్నీగా, ఎనర్జిటిక్‌గా ఉండబోతుందన్న సంకేతాలు స్పష్టమయ్యాయి.

తెలంగాణ రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ చిత్రంలో తరుణ్ భాస్కర్ మార్క్ కామెడీ, డైలాగ్ డెలివరీ ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. యారో సినిమాస్ పతాకంపై బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రానికి బద్రప్ప గాజుల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ ఫుల్ లెంగ్త్ కామెడీ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటిస్తోంది. సీనియర్ నటుడు వి.కె. నరేష్, అఖిల్ రాజ్ ఉద్దెమారి, చైతన్య రావు ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. సంగీతాన్ని సురేష్ బొబ్బిలి అందిస్తుండగా, సినిమాటోగ్రఫీ బాధ్యతలను శ్యామ్ దూపాటి, ఎడిటింగ్‌ను శ్రవణ్ కటికనేని నిర్వహిస్తున్నారు. పెళ్లి చుట్టూ తిరిగే కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రం ఇప్పటికే తెలంగాణలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో షూటింగ్ పూర్తి చేసుకుని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. తరుణ్ భాస్కర్ మేనరిజమ్స్, అనుపమ